# వెంటాడే జ్ఞాపకాలు

దూరంగా కనిపిస్తున్న దేవాలయ గోపురాలూ, ఇళ్ళూ, చెట్లూ అన్నీ వెన్నెలలో స్నానం చేస్తున్నట్టున్నాయి.

చల్లగా వుంది.

డాబామీద అంత ఎత్తులేని గోడను ఆనుకుని నిలబడింది సుజాత. ఆమె నీడ గోడమీదిగా కిందకు పడుతోంది.

మెల్లగా వీస్తున్న గాలికి ఆమె పమిట చిన్నగా ఎగురుతోంది.

రోడ్డుమీదకి చూస్తోంది సుజాత. ఆమెకు అప్పుడే రోడ్డుమలుపు తిరిగి చిన్నగా వస్తున్న లాయరుగారి కొడుకు, కోడలు కనిపించారు. వాళ్ళిద్దరూ చిన్నగా కబుర్లు చెప్పకుంటూ వస్తున్నారు. తండ్రి చెయ్యి పట్టుకుని చిన్నగా అడుగులు వేస్తూంది మూడేళ్ల పాప.

బరువుగా నిట్టూర్చింది సుజాత.

ఆమె కళ్ళముందు ఈశ్వర్ కదిలాడు. అప్రయత్నంగా కన్నీళ్ళు వచ్చాయి. దుఃఖం ముంచుకు వచ్చింది. ఎగురుతున్న పమిటలో కళ్లు వత్తుకుంది ఆమె.

పాప ఇక నడవలేనని రోడ్డుమీదనే నిలిచిపోయింది. నవ్వుతూ పాపను ఎత్తుకున్నాడు అతను.

అతని స్థానంలో సుజాతకు ఈశ్వర్ కనిపించాడు. తను, ఈశ్వర్, పాప రోజూ దేవాలయానికి వెళ్ళి చీకటిపడిన తర్వాత ఇంటికి తిరిగి వస్తున్న దృశ్యం కనులముందు గిర్రున తిరిగింది.

ఆమెలో ఆలోచనలు మొదలయినాయి.


ఆ ఆలోచనలను ఆపగలిగే శక్తి సుజాతకు లేదు. ఈవిషయం ఆమె ఎప్పుడో గ్రహించింది.

డాబామీదకు ఎవరో వస్తున్న చప్పుడు వినిపించింది. మెట్ల వయిపు చూసింది సుజాత. క్షణం తర్వాత రాజేశ్వరి వచ్చింది.

"పాప లేచిందా?" అడిగింది.

"లేవలేదు వదినా.... నిద్రపోతోంది కదలకుండా" దగ్గరగా వస్తూ అన్నది రాజేశ్వరి.

ఆ తర్వాత సుజాత మాట్లాడలేదు.



రాజేశ్వరికూడా ఆమెను మాట్లాడించే ప్రయత్నం చెయ్యలేదు. ఇదే నెలా ఇరవైరోజుల క్రితమయితే వదినా మరదళ్ళిద్దరూ ఒక్క నిమిషం కూడా మవునంగా వుండక ఎన్నెన్నో కబుర్లు చెప్పుకునే వాళ్ళు. నవ్వుకునే వాళ్ళు.

కాని ఇప్పుడు?

ఇద్దరి మధ్యనా భరించలేని నిశ్శబ్దం....

ఈ నిశ్శబ్దాన్ని రాజేశ్వరి తట్టుకోలేకపోతోంది. నవ్వుతూ ఎంతో సరదాగా వుండే వదిన జీవితం ఇలా వున్నట్టుండి చీకటి అయిపోవటాన్ని రాజేశ్వరి భరించలేక పోతోంది.

కాని తను ఏం చెయ్యగలదు? తనేకాదు. ఎవ్వరూ ఏమీ చెయ్య లేరు.

'వదిన తట్టుకుని ఎలా బతగ్గలిగిందో?' ఇలా ఎన్నోసార్లు అను కుంది రాజేశ్వరి.

ఆ షాక్ ఎటువంటిదో ఆమెకు తెలుసు.

ఈశ్వర్.... తన రెండో అన్నయ్య – ఇలా హటాత్తుగా తమందరినీ దుఃఖ సముద్రంలో ముంచి ఈలోకం నించి వెళ్ళిపోతాడని ఎవరు మాత్రం వూహించగలిగారు?

సుజాత ముఖంలోకి చూసింది రాజేశ్వరి.

రోడ్డుమీదకే చూస్తున్నది ఆమె. ఆమె చూపులు నిశ్చలంగా వున్నాయి.

ఆమెను పలకరించాలనుకున్నది. కాని ఎందుకో ఆమె మవు నాన్ని చెదర గొట్టాలనిపించలేదు. ఆమెను ఈశ్వర్ గురించిన ఆలో చనల నించి దూరం చెయ్యాలనిపించలేదు.

చంద్రుడు మెల్లగా ఆకాశంలో కదులుతున్నాడు. పక్కనే వున్న డాక్టరుగారింట్లో రేడియోలో పాట వస్తోంది.

పాట అయిపోయింది. రేడియోలో టైమ్ చెప్పారు. తొమ్మిది గంటలయ్యింది.

'ఏమిటీ జీవితం?' ఆలోచిస్తోంది సుజాత.

ఇదే ప్రశ్న ఆమెను వెంటాడుతున్నది.

మూడూ ముళ్ళువేసి తన జీవితాన్ని తనతో ముడి వేసుకున్న ఆ మనిషిని మృత్యువు యాక్సిడెంట్ రూపంలో తన వాడిలోకి లాక్కున్నదని తెలిసిన మరునిముషంలో తను కూడా ఆయిన దగ్గరకు వెళితే ఎంత బావుండేది? వెళ్ళకుండా ఎలా వుండ గలిగింది?!

ఒక్కటే వెలుగు—

తన పాప.... రెండేళ్ళ పాప.... తమ ఆనందానికి, తమ ప్రేమకు ప్రతిరూపం. ఆ వెలుగుకోసమే తను బ్రతుకుతున్నది.

దేవుడు తనపట్ల క్రూరంగా ప్రవర్తించాడని తను పాప పట్ల నిర్దయగా ప్రవర్తించలేదు. పాపను ఒంటరిదాన్ని చెయ్యలేదు.

ఇప్పటికీ ఆయన తన కళ్ళముందు తిరుగుతున్నట్టే అనిపిస్తోంది. ఆయన జ్ఞాపకాలు తనని వెంటాడుతున్నాయి.

నిజంగా.... ఎంత మధురమయిన స్మృతులు....

అవే.... ఇప్పుడు సుజాతను కత్తికోత కోస్తున్నాయి.

మూడేళ్ళ ఆమె దాంపత్య జీవితంలో భర్తతో కలిసి అనుభవించిన సుఖ దుఃఖాలు వాటి తాలూకు అనుభవాలు, అతని ప్రవర్తన, మాటలు, చేసుకున్న వాగ్దానాలు, భవిష్యత్తును గురించిన ఆలోచనలు.. ఇవన్నీ ఒక్కొక్కటే గుర్తుకు వచ్చి ఆమెను మరింత బాధపెడుతున్నాయి.

అయినా తప్పదు.

అంతా ఎంతో సహజంగా జరిగిపోతున్నదే.

"టైం మెంతయ్యింది?"

తలతిప్పి చూసింది సుజాత.

ఇంటిముందు వీధిదీపం దగ్గర నిలబడివున్నాడు పెద్దమనిషి విశ్వనాథం- అతని స్నేహితుడు.

చేతినున్న వాచీకేసి చూసుకున్నాడు విశ్వనాథం. వీధిదీపం వెలుతురులో మెరిసింది వాచీ.

"తొమ్మిదీ ఇరవై" చెప్పాడతను.

వెళ్ళిపోయాడు ఆ స్నేహితుడు.

మరిది చేతినున్న ఆ వాచీ చూడగానే సుజాత మొహం అదోలా ఐపోయింది. గుండెలో ముల్లు గుచ్చుకున్నట్టు అనిపించింది.

అంతా ఒక్కసారిగా గుప్పున గుర్తుకు వచ్చింది సుజాతకు.

ఆ వాచీ తన భర్త ఈశ్వర్‌ది. మూడు నెలల క్రితమే తను, ఈశ్వర్ ఆ వాచీని కొన్నారు.

ఆ తెల్లటి డయల్ తనని ఎంతగానో ఆకర్షించింది. ఈశ్వర్‌కి కూడా బాగా నచ్చింది. అందుకే ఇద్దరూ ఆ వాచీనే కొనటానికి నిర్ణయించుకున్నారు.

దాన్ని కొనటానికి ముందు "పోనీ.... నువ్వు కొనుక్కోరాదూ?" అన్నాడు ఈశ్వర్....

"నాకేం తొందర? బయటకు వెళ్ళే మనిషి.... మీకు వాచీ ముఖ్యం. తర్వాత నాకు కొనవచ్చు... మీరే తీసుకోండి"అన్నది తను.

ఆ వాచీ కొనటానికి ఆరునెలల నించీ డబ్బు దాచివుంచాడు ఈశ్వర్. అంతకుముందు అతనికి వాచీలేదు.

షాపునించి ఇంటికి వచ్చేసరికి మరిది విశ్వనాథం ఇంట్లోనే వున్నాడు. పరీక్షల రోజులు చదువుకుంటున్నాడు.

ఈశ్వర్ చేతినున్న వాచీచూసి విశ్వనాథంమొహం సంతోషంతో విప్పారింది.

"ఈ వాచీ నాకేనా అన్నయ్యా!" అడిగాడు ఆనందంతో.

ఈశ్వర్ వెంటనే మాట్లాడలేకపోయాడు. తమ్ముడికి వాచీ కొని పెడతానని నాలుగునెలల క్రితం మాటిచ్చాడు.

"కాదు విశ్వనాథం.... ఈ వాచీ ఆయనే కొనుక్కున్నారు. ఈసారి నీకు" అన్నది తను.

వెంటనే అన్నాడు ఈశ్వర్– "నువ్వా డిగ్రీ పాసవగానే తప్పకుండా కొనిపెడతానురా"

తల వూపాడు విశ్వనాథం.

అన్నయ్య పోయిన తర్వాత ఆ వాచీని విశ్వనాథమే తీసుకున్నాడు. ఆ వాచీని విశ్వనాథం చేతికి చూసిన ప్రతిసారీ సుజాత హృదయం కలుక్కుమంటోన్నది.

తన భర్తకు చెందిన వస్తువు. తనకెంతో విలువైనది అపురూపమైనది. అటువంటి వస్తువును మరో మనిషి వాడుకుంటున్నప్పుడు సుజాతకు ఎంతో బాధ కలుగుతోంది. అయినా ఆ వాచీని విశ్వనాథం నించి ఎలా తీసుకోగలదూ? 'అది నాకు ఎంతో విలువైనది. ఆయన స్మృతిచిహ్నం- ఆ వాచీని నాకివ్వు విశ్వనాథం' అని అతనితో ఎలా చెప్పగలదు?

"వదినా.... వదినా...." రాజేశ్వరి పిలుపుతో ఆలోచనలనించి బయటపడింది సుజాత.

"పాప లేచినట్టుంది.... ఏడుస్తోంది"

గబగబా కిందికి నడిచింది సుజాత. అలా వెళుతున్న వదినని చూసి నిట్టూర్చింది రాజేశ్వరి.

* * * *

రాజేశ్వరి— పాపతో ఆడుకుంటోంది.

అప్రయత్నంగానే తలెత్తి ఎదురుగావున్న అద్దంలోకి చూసుకుంది సుజాత. తన రూపాన్ని చూస్తే తనకే ఆశ్చర్యం కలిగింది.

ఆ తర్వాత ఏడుపు వచ్చింది.

నుదుట కుంకుమలేని మొహం చంద్రుడులేని ఆకాశంలావుంది. పాలిపోయిన చెక్కిళ్ళు.... జీవం కోల్పోయిన కళ్ళు. ఉన్నట్టుండి ఇంకో ఇరవై యేళ్ళు పైబడినట్లుగా అనిపించింది.

దృష్టిని మరల్చి కిటికీలోనించి చూసింది.

వరండాలో కుర్చీలో కూర్చుని ఎవరికో ఉత్తరం రాస్తున్న సుజాత బావగారు కనిపించాడు. ఆయన చేతిలోవున్న పెన్నుమీద సుజాత దృష్టి నిలిచిపోయింది.

నీలిరంగు పెన్ను.

ఎంతో అందంగా వుంది.

సుజాత గుండెపొరల్లో సన్నగా బాధ మొదలయ్యింది.

ఆ పెన్ను.... ఆ నీలిరంగు పెన్ను ఆయనదే.... ఆ పెన్నును ఈశ్వర్ కొనలేదు. ఎక్కడో రోడ్డుమీద దొరికిందట.... ఆ పెన్నంటే భర్తకు ఎంతో ఇష్టం. బాగా రాస్తుంది. ఆ పెన్ను రోడ్డుమీద దొరికిందని చెప్పినప్పుడు బావగారు దాన్ని తనకివ్వమని అడిగాడు. కాని, ఆయన ఇవ్వలేదు. కావాలంటే ఇంకో పెన్ను కొనిస్తానని అన్నాడు.

తను నాలుగు నెలలక్రితం పుట్టింటికి వెళ్ళినప్పుడు ఆయన తనకు రాసిన ప్రేమలేఖలు, విరహగీతాలు ఆ పెన్నుతో రాసినవే. ఆ ఉత్తరాల్లో ఈశ్వర్ రాసిన కొన్ని వాక్యాలు సుజాత కళ్ళముందు కదిలాయి.

"డియర్ సుజా! ఈ నీలిరంగు పెన్ను ఎంత అదృష్టం కలిగి వున్నదో.... నీమీద నాకువున్న ప్రేమ - నువ్వు దగ్గర లేకపోవడం వల్ల నేను పొందుతున్న విరహవేదన ఒక్క ఈ పెన్నుకే తెలుసు.... అయినా దీనిగురించి నాకు భయంలేదు- ఇది ఎవరికీ ఈ రహస్యాలను చెప్పలేదు. పాపం.... ఈ నీలిరంగు పెన్నుకు మాటలు రావుకదా!"

ఇప్పుడు ఆయన పోయిన తర్వాత ఈశ్వర్ ఎంతగానో ఇష్టపడిన ఆ నీలిరంగు పెన్ను బావగారి చేతిలో వుంది.

సుజాత కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఆమె కన్నీళ్ళను తుడుచుకోవటం అప్పటికి కొన్ని నిమిషాల క్రితమే ఆ గదిలోకి వచ్చిన రాజేశ్వరి గమనించింది.

ఒక్కసారిగా రాజేశ్వరినిచూసిన సుజాత ముఖాన్ని గోడవైపుకు తిప్పుకున్నది.

ఆ గదిలోనించి వెళ్ళిపోయింది రాజేశ్వరి.

* * * *

"కరెంటు వచ్చింది" చెప్పింది సుజాత చిన్నమరిది చంద్రంతో-

సాయంత్రం ఐదు గంటలయ్యింది.

టేబిల్‌మీద రెండు దుప్పట్లను పరిచాడు చంద్రం. ఎలెక్ట్రిక్ ఐరన్ బాక్స్‌ను తీసుకువచ్చి ప్లగ్ గుచ్చి బట్టలను ఇస్త్రీ చెయ్యటం మొదలుపెట్టాడు.

అతను ఫస్టు షో సినిమాకు వెళ్ళాలిట. లైబ్రరీ నించి రెండు నవలలు తీసుకువస్తానని రాజేశ్వరికి ప్రామిస్‌చేసి తన బట్టలను ఆమె

చేత సబ్బు పెట్టించి పుతికించాడు. వెంటనే ఇస్త్రీ చేసుకుందామంటే కరెంటు లేదు.

ప్యాంటు తర్వాత షర్టు తీసుకువచ్చాడు చంద్రం. దానిమీద నీళ్ళు చల్లుతున్నాడు.

గుమ్మందగ్గర నిలబడి వుంది సుజాత. ఆ షర్టునే చూస్తున్నది. ఆ షర్టుకూడా ఆయనదే.

సరిగ్గా యాక్సిడెంటయి ఈ లోకాన్ని వదిలి వెళ్ళటానికి పది రోజుల క్రితమే దాన్ని కుట్టించు కున్నాడాయన. ఆ షర్టును ఒక ఫ్రెండుతో కలసి షాపుకు వెళ్ళినప్పుడు చాలా బావుందని కొనుక్కున్నాడు. తనక్కూడా ఆ షర్టు ఎంతో నచ్చింది. ఆశ్చర్యం ఏమిటంటే ఇద్దరిదీ ఒక్కటే అభిరుచి. ఏదయినా ఇద్దరికీ వెంటనే నచ్చేది. ఏదయినా ఒక వస్తువు కొనేటప్పుడు వివాద పడటం జరగనేలేదు.

ఆ షర్టు వేసుకున్నరోజు తనే ఆయన వద్దన్నా వినకుండా ఫోటో స్టూడియోకి తీసుకెళ్ళింది. తను ఆయనకు ఎంతో ఇష్టమయిన చీర కట్టుకుంది. ఇద్దరి మధ్యలో పాప.... ఫోటో తీయించుకున్నారు. ఫోటోలో ఆయన షర్టు డిజైన్ ఎంతో బాగా వచ్చింది.

కాని ఇప్పుడు మిగిలింది?

ఆ ఫోటో.... ఆ షర్టు....

ఆ షర్టు చంద్రంకు సరిగ్గా సరిపోయింది. చంద్రం కూడా చిన్నవాడయినా ఆయనంత వుంటాడు. అందుకే ఆ షర్టును అతను వేసుకుంటున్నాడు. ఆ షర్టును చంద్రం వేసుకుంటే ఎందుకో తన మనసు విలవిల్లాడి పోతుంది.

ఇస్త్రీ చెయ్యటం ఐపోయింది.

చంద్రం ప్యాంటు వేసుకున్నాడు. తర్వాత షర్టు వేసుకుని గబగబా వెళ్ళిపోయాడు.

అలా వెళుతున్న చంద్రం షర్టునే చూస్తూ వుండి పోయింది సుజాత.

కిటికీలోనించి వదిన్నే రాజేశ్వరి చూస్తోందని సుజాతకు తెలీదు.

* * * *

డాబామీద చాపపైన పడుకుంది సుజాత. పక్కనే పడుకున్న పాప చంద్రుడినీ, నక్షత్రాలనూ చూస్తోంది.

చంద్రుడిని కమ్ముకుంటున్న మేఘాలను చూస్తోంది సుజాత.

ఆమెలో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

తనకెంతో విలువైన తన భర్త వస్తువులను తన బావగారు, మరుదులు వాడుకోవటం సహించలేక పోతోంది. అవి తనకెంతో అపురూపమైనవి. అవన్నీ ఆయన జ్ఞాపకాలు - అవి తన దగ్గరే వుండాలి.

అలా అని వాటిని తనకి ఇచ్చెయ్యమని అడగటం బావుంటుందా?

అసలు తను అలా అడగ్గలదా? ఎలా అడగటం? ఒకవేళ అడిగితే వాళ్ళు ఏమనుకుంటారు?

'ఇవన్నీ నీకెందుకు? ఈ వస్తువులను నువ్వు వాడుకుంటావా?' అని వాళ్ళు అడిగితే?

అందుకు తన దగ్గర వున్న జవాబు యేమిటి?

ఇందుకు ఏమిటి పరిష్కారం? - ఆలోచిస్తూంది.

డాబామీదకు రాజేశ్వరి రావటాన్ని గమనించలేదు సుజాత....

"పాప నిద్రపోతున్నదా వదినా?"

ఉలిక్కిపడింది సుజాత.

* * * *

ఉదయం ఎనిమిది గంటలు దాటుతోంది.

కిటికీలోనించి వలుచని ఎండ లోపలకు పడుతోంది. పాపకు స్నానం చేయించి గౌను తొడుగుతోంది సుజాత. పాప నవ్వుతోంది.

ముద్దుపెట్టుకుంది పాపను సుజాత.

తన జీవితానికో ధ్యేయం- తన వెలుగు- ఈ పాప!

ఆయన తనకు మిగిల్చిన కానుక.

నిజంగా ఇది ఎంత అదృష్టవంతురాలు. దుఃఖమంటే యేమిటో తెలీదు.

గదిలోకి ఎవరో వచ్చిన అలికిడి అయ్యింది.

వెనక్కు తిరిగి చూసింది సుజాత.

విశ్వనాథం!

అతను మవునంగా చేతినున్న వాచీతీసి- "ఇదిగో వదినా అన్నయ్య వాచీ" అని దాన్ని సుజాత ముందువుంచి గబగబా వెళ్ళిపోయాడు.

నిజంగా సుజాతకు షాక్!

ఆశ్చర్యపోయింది.

ఏమిటిది? తన మనసును మరిది విశ్వనాథం చదవగలిగాడా?

మరో నిముషానికి బావగారు లోపలకు వచ్చాడు. ఆయన చేతిలో నీలిరంగు పెన్ను వుంది.

"ఇదిగో సుజాతా.... ఇది వాడి పెన్ను.... ఇది నీదగ్గర వుండటమే న్యాయం" అని ఆ పెన్నును ఆమెకు ఇచ్చి వెళ్ళిపోయాడు.

సుజాతకు మాటలు రాలేదు.

అంతా కలగా అనిపించింది.

చంద్రం కూడా వచ్చాడు. అతని చేతిలో షర్టువుంది.

"ఏమిటిదంతా?" అనగలిగింది సుజాత.

"అన్నయ్య షర్టు"

"అయితే నాకెందుకు?"

అతనలా షర్టును తీసుకువచ్చి తనముందు నిలబడితే సుజాతకు బాధ అనిపించింది.

ఎంతో ఇష్టంగా చంద్రం ఆ షర్టును వేసుకుంటున్నాడు. దాన్ని తను తీసుకోటం??

అతను మాట్లాడలేదు. దాన్ని అక్కడేవుంచి వెనక్కు వెళ్లాడు.

"చంద్రం" చిన్నగా పిల్చింది సుజాత.

అతను ఆగలేదు. బయటకు వెళ్ళిపోయాడు.

వాచీ - పెన్ను - షర్టు - వాటికేసి తదేకంగా చూస్తోంది సుజాత.

"ఆశ్చర్యపడకు వదినా.... నీ మనసును నేను గ్రహించగలిగాను. ఈ వస్తువులు నీకెంత విలువైనవో నాకు తెలుసు. ఇవి నీదగ్గర వుండటమే న్యాయం వదినా! ఆ వస్తువుల్లో నువ్వు అన్నయ్యను చూసుకుంటున్నావు. ఆ వస్తువులను మరొకరు వాడుకోవటం నీ మనసుకు ఎంత క్షోభ కలిగిస్తుందో నేను వూహించగలిగాను. నీకే కాదు. ఎవరికియినా అంతే. అన్నయ్యలు ముగ్గురూ ఆ వస్తువుల్లో ఈశ్వర్ అన్నయ్యను చూసుకుంటున్నారు. ఆ వస్తువుల విలువ వాళ్ళకీ తెలుసు. అయినా, వాళ్ళకంటే అవి నీకు మరింత విలువైన జ్ఞాపకాలు. వాళ్ళుకూడా ఆ వస్తువులను అన్నయ్య జ్ఞాపకాలుగా చూసుకుంటున్నారు. కాబట్టి నీమనసు తెలుసుకోలేకపోయారు వదినా! దయచేసి ఈ వస్తువులను నీదగ్గరే వుంచు- అవి నీదగ్గర వుంచటమే న్యాయం" మాట్లాడటం ఆపింది రాజేశ్వరి.

సుజాత ఏడుస్తూంది ముందున్న ఆ వస్తువులను చూస్తూ.

*

(29-7-81 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)